## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నిధులు మంజూరు చేసినట్లు స్థానిక సీడీపీఓ ముత్తమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 132 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 91 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేదని, దీంతో ఆయా కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు ఒక్కొక్క కేంద్రానికి రూ.13వేల రూపాయాల చొప్పున మొత్తం రూ.11.72లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులు ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్ల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయని, వాటితో అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యంతోపాటు, ఆయా కేంద్రాల్లో ఉన్న ఎల్ఈడీ టీవీలు వినియోగంలోకి వస్తాయని సీడీపీఓ వివరించారు.

### అప్రమత్తంగా ఉండాలి

మణుగూరుటౌన్: మణుగూరులో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో అపరిచితుల సంచారం పట్ల స్థానికులు దృష్టి సారించి పోలీసులకు సమాచారం అందించాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో ఇటీవల జరుగుతున్న చోరీల నేపథ్యంలో గస్తీ పెంచామని, ప్రతి రోజూ రాత్రి వేళ ఒక ఎస్ఐతో పాటు సిబ్బంది గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా సింగరేణి కార్మికులు నివసించే పీవీకాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా ఊరికి వెళ్లే సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని, విలువైన వస్తువులు ఇంట్లో లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఆరుబయట నిద్రించే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

### భద్రాచలాన్ని ఎస్సీ నియోజకవర్గంగా మార్చాలి

భద్రాచలంటౌన్: భద్రాద్రి జిల్లాలో ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న భద్రాచలం నియోజకవర్గాన్ని ఎస్సీ రిజర్వుడ్‌గా మార్చాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎంపీ కాలనీలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లాకు ఒక ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గం ఉందని, కానీ, భద్రాద్రి జిల్లాలో ఒక్క ఎస్సీ నియోజకవర్గం లేదని అన్నారు. కార్యక్రమంలో డేగల శివ, వంశీ, నానిబాబు, శాంతయ్య, ఏసు, సామ్యేలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### పీఓకు వినతి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో జీఓ నం.3పై సుప్రీం కోర్టు ఆదివాసీ తరఫున రివ్యూ పిటిషన్ వేయాలని, అనుమతులు ఇచ్చిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు సోంది మల్లుదొర మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించి ఏజెన్సీ జీఓలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగ యువత, విద్యార్థులు జీఓ నం.3ని కాపాడడం కొరకు ఉద్యమం చేయడానికి సిద్ధం ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కారం గోపాల్, కోరం మురళి, సర్వేశ్వరరావు, వాగే వెంకటేష్, సమ్మయ్య, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

### ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

బూర్గంపాడు: మే 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం కోరారు. బూర్గంపాడులో బుధవారం సమ్మె ప్రచార పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలను తిప్పికొట్టేందుకు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను అన్నివర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రాయల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, గుంటక కృష్ణ, కంత్రి ప్రతాప్, కేసుపాక రాంబాబు, మందా కృష్ణ,శంకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ నాయకుడికి నివాళి

అశ్వారావుపేటరూరల్: మాజీ ఏఐటీయూసీ జిల్లా నాయకులు, సీనియర్ సీపీఐ నాయకుడు తిర్నాటి సత్యానారాయణ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం, స్మారక స్థూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. నియోజకవర్గ నాయకులు ఎస్‌డీ సలీం, ఏపీ రాష్ట్ర సమితి నాయకులు ఎండి.మునీర్, కారం దారయ్య, స్థానిక నాయకులు పఠాన్ జలాల్ ఖాన్, గన్నిన రామకృష్ణ, నూకవరపు విజయ్‌కాంత్, బలరాం పాల్గొన్నారు.

# భూమికి సారం.. పంటలకు పుష్టి

- చెరువు మట్టిలో పుష్కలంగా సూక్ష్మపోషకాలు
- ఉపాధిహామీలో భాగంగా తవ్వకం, పొలాలకు తరలింపు
- చౌడు, ఇసుక రాతినేలలు సారవంతం





పద్మాపురంలో ట్రాక్టర్‌లో చెరువు మట్టిని వేస్తున్న ఉపాధి కూలీలు

కరకగూడెం: ఆధునిక వ్యవసాయంలో రసాయన ఎరువులపై ఆధారపడటం వల్ల భూమిసారం క్రమంగా క్షీణించి.. పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. తద్వారా రైతులకు ఆర్థిక భారం పెరుగుతోంది. ఈ సమస్యకు స్థిరమైన, సేంద్రియ పరిష్కారంగా చెరువు మట్టి (ఒండ్రు మట్టి) రైతులకు వరంగా మారుతోంది. చెరువులు, కుంటలలోని ఒండ్రు మట్టిని పొలాలకు తరలించడం, ద్వారా భూమిని సారవంతం చేసే సంప్రదాయ పద్ధతికి రైతులు మళ్లీ ప్రాధాన్యతనిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల సహాయంతో రైతులు తమ పొలాలకు ఒండ్రు మట్టిని పలు ప్రాంతాల్లో తరలించుకుంటున్నారు

**చెరువు మట్టి.. సహజ శక్తి**

చెరువు మట్టి లేదా ఒండ్రు మట్టి అనేది చెరువులు, కుంటల అడుగు భాగంలో సేకరించబడే సేంద్రియ ఎరువు. వర్షాకాలంలో ఎత్తైన ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో ఇసుక, బంకమట్టి, కుళ్లిన వృక్ష జన్య పదార్థాలు, ఇతర సేంద్రియ వ్యర్థాలు చెరువుల్లో చేరి కాలక్రమేణా సారవంతమైన ఎరువుగా మారుతాయి. ఈ మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు జింక్, ఇనుము, మాంగనీస్ వంటి సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ మట్టిని పొలాల్లో చల్లడం వల్ల భూమి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. నేల ఆకృతి మెరుగుపడుతుంది. పంటలకు అవసరమైన పోషకాలు సమతులంగా అందుతాయి. రసాయన ఎరువులతో పోలిస్తే చెరువు మట్టి పర్యావరణానికి హాని చేయదు. దీర్ఘకాలంలో భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

**ఉపాధి హామీతో దన్ను..**

గ్రామీణ ప్రాంతాల్లోని చెరువుల్లో నీటి మట్టం తగ్గడంతో ఒండ్రు మట్టిని తవ్వి పొలాలకు తరలించే అవకాశం ఏర్పడింది. ఈ ప్రక్రియలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తూనే రైతులకు చెరువు మట్టిని సులభంగా పొందే అవకాశం లభిస్తోంది. రైతులు ట్రాక్టర్ల సాయంతో ఒండ్రు మట్టిని తమ పొలాలకు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల చెరువులు శుభ్రమవడంతో పాటు వాటి నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతోంది.

**రైతుల ఆసక్తి..**

చెరువు మట్టి ప్రయోజనాలను గుర్తించిన గ్రామీణ ప్రాంత రైతులు దీనిని వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మట్టిని పొలాల్లో చల్లడం వల్ల పంట దిగుబడి పెరగడమే కాకుండా గింజలు బరువుగా, ఆరోగ్యకరంగా ఉంటాయని రైతులు విశ్వసిస్తున్నారు. చౌడు, ఇసుక రాతి నేలలు వంటి తక్కువ సారవంతమైన భూములను కూడా ఈ మట్టి సారవంతం చేస్తుంది. అంతేకాకుండా చెరువు మట్టి వినియోగం వల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా పంటల గుణాత్మకత మెరుగవుతుంది. ఈ నేపథ్యంలో దీనిని వినియోగించేందుకు రైతులు ఆసక్తి వ్యక్త పరుస్తున్నారు.





### మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి..



మా పొలంలో రసాయన ఎరువులు వాడి వాడి భూమి చాలా బలహీనమైపోయింది. దిగుబడి కూడా బాగా తగ్గిపోయింది. గతేడాది పొలంలో ఒండ్రు మట్టి వేయడంతో మళ్లీ పంటలు బాగా పండుతున్నాయి. పెట్టుబడి ఖర్చు కూడా తగ్గింది. మా ఊర్లో చాలా మంది రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. అందరికీ మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి.

– పఠాన్ మహిబూబ్ ఖాన్, రైతు, పద్మాపురం

### పంటల పుష్టికి దోహదపడింది..



మాకు చెరువు మట్టి భూమిలో సూక్ష్మజీవుల కార్యకలాపాలను పెంచి నీటి నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరిచి పంటల పుష్టికి దోహదపడింది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడమే కాక భూమి ఆరోగ్యాన్ని దీర్ఘకాలంలో కాపాడుతోంది. సేంద్రియ పదార్థాలు మరియు సూక్ష్మ పోషకాలను జోడించి భూసారాన్ని గణనీయంగా పెంచింది.

– నాగబండి వెంకటేశ్వర్లు, రైతు, కరకగూడెం

### భూమి ఆరోగ్యంగా..



చెరువులోని ఒండ్రు మట్టిలో పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది భూమిని సారవంతం చేస్తుంది. ఒండ్రు మట్టి వంటి సహజ పద్ధతులను ఉపయోగించడం ద్వారా భూమిని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. పొలంలో దుక్కి దున్నే సమయంలో ఒండ్రు మట్టిని వేయడం ఉత్తమం.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

# సబ్ జైలులో తనిఖీ



శిశుగృహలో పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

భద్రాచలంఅర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ బుధవారం భద్రాచలం సబ్ జైలులో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, నిరుపేద ఖైదీలకు న్యాయపరంగా ఏదైనా సహకారం కావాలంటే జిల్లా లీగల్ సర్వీస్ ద్వారా ఉచితమైన న్యాయ సదుపాయం అందిస్తామన్నారు. సబ్ జైల్‌లో ఉన్న మరుగుదొడ్లు, శుభ్రత, స్టోర్ రూం, కిచెన్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లోని శిశుగృహను సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కూనవరం రోడ్డులోని మానవసేవ వాలంటరీ అనాథ వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సంబంధమైన సమస్యలు ఏమైనా ఉంటే డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, జూన్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై భద్రాచలం కోర్ట్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి, న్యాయవాదులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం జైలు సూపరింటెండెంట్ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సామరస్యంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

మణుగూరుటౌన్: రానున్న బక్రీద్ వేడుకలను మతసామరస్యంతో జరుపుకోవాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజ్ సూచనల మేరకు హిందు, ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మణుగూరులో స్నేహపూరిత వాతావరణం ఉందని దానిని కొనసాగించాలని సూచించారు. బక్రీద్ నేపథ్యంలో గోవుల తరలింపుపై సమాచారం ఉంటే ఎవరైనా పోలీసులకు స్వేచ్ఛగా సమాచారం అందించొచ్చని, వ్యక్తిగత దూషణలకు వెళ్లి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని సూచించారు. ఏడూళ్లబయ్యారం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. విస్తృతంగా ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియాలో వచ్చే పాత వీడియోలకు స్పందించొద్దని గ్రూపుల్లో షేర్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హిందు, ముస్లిం మత పెద్దలు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, సీఐ వెంకటేశ్వరరావు, అశోక్, ఎస్ఐ మేడ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ఆస్పత్రుల్లో రెండో రోజూ తనిఖీలు



స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రెండో రోజు కూడా తనిఖీలను నిర్వహించారు. ఇటీవల సత్తుపల్లిలో జరిగిన ఓ ఘటన ఆధారంగా భద్రాచలంలో అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడానికి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. తనిఖీల్లో అధికారులు వైద్య, స్కానింగ్ సిబ్బందికి పలు ప్రభుత్వ నిబంధనలు గుర్తు చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డిప్యూటీ డీఎంహెచ్ఓ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి హెచ్చరించారు. తనిఖీల్లో భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఈఎంఓ మొహమ్మద్ ఫైయాయుద్దీన్ ఆధ్వర్యంలో జరిగాయి.

### వర్షానికి కూలిన పూరిల్లు

అశ్వాపురం: మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షానికి మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో కొమరం పుల్లయ్య పూరిల్లు కూలింది. ఇంట్లో సామాన్లు తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు పుల్లయ్య కోరారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు హైస్కూల్ సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటాపురం గ్రామానికి చెందిన జమీర్ బైక్‌పై మొండికుంట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో జమీర్‌కు గాయాలయ్యాయి. 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

# పూర్తయిన చెరువు మరమ్మతులు



మొద్దులగూడెంలో అలుగు కాలవను పరిశీలిస్తున్న రైతులు, నాయకులు

దమ్మపేట: ఇందిరమ్మ చెరువు బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొద్దులగూడెం గ్రామ పరిధిలో ప్రారంభించిన చెరువుల మరమ్మతు పనులు పూర్తయ్యాయి. మొద్దులగూడెం గ్రామ శివారులోని పెద్ద చెరువు, చింతల చెరువుల్లో పూడికతీతలతో పాటుగా అలుగు కాలువలకు మరమ్మతులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం అలుగు కాలవలను పరిశీలించిన రైతులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట మేరకు అతి తక్కువ కాలంలోనే చెరువుల మరమ్మతులను పూర్తి చేయించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మోరంపూడి వెంకటేశ్వరరావు, దొడ్డా నరేష్, బొంతు రాజశేఖర్, గణపరాము తదితరులు పాల్గొన్నారు.

# పార్టీకి పూర్వవైభవం ఖాయం

చండ్రుగొండ: తెలంగాణలో తమ పార్టీకి పూర్వవైభవం ఖాయమని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటు ఇన్‌చార్జ్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. మండలంలోని దామరచర్ల గ్రామంలో బుధవారం పార్టీ మండలశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ అధ్యక్ష, కార్యదర్శులుగా వారాధి సత్యనారాయణ, చాపలమడుగు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా రామనాథం మాట్లాడారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్రం స్వామి, చెరుకూరి చలపతి, నార్లపాటి శ్రీనివాసరావు, కొదుమూరి సత్యనారాయణ, నెక్కడపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని రాజుపేట గ్రామంలో బుధవారం టీడీపీ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్, అశ్వారావుపేట నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు వాసిరెడ్డి రామనాథం, చెరుకూరి చలపతిరావు పాల్గొని మాట్లాడారు. టీడీపీ పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్రం స్వామి, మండల కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, గంగిశెట్టి సత్యనారాయణ, ఎండి.జబ్బార్, కీసరి లక్ష్మణరావు, బిక్కుమళ్ల సుధాకర్, దుర్గాప్రసాద్, కీసరి శ్రీను, సడియం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ వేస్ట్‌పై కలెక్టర్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో బయో మెడికల్ వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలించడంపై కలెక్టర్ స్థానిక అధికారులు ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు తరలించడంపై బుధవారం 'సాక్షి'లో 'మూటల మాటల మెడికల్ వేస్ట్'పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. సంబంధిత జిల్లా వైద్యశాఖ అధికారిని పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా ప్రైవేట్ ఆస్పత్రులు నడుచుకున్నా, లేదా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడినా సదరు ఆస్పత్రులను సీజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

# చోరీల నివారణకు చర్యలు చేపట్టాలి

మణుగూరుటౌన్: కార్మిక కుటుంబాలు నివసించే పీవీకాలనీ క్వార్టర్స్‌లో చోరీల నివారణకు యాజమాన్యం, పోలీసులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కోరుతూ ఏరియా కార్మిక సంఘాల నాయకులు బుధవారం జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, కాలనీ వెల్ఫేర్ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. 12వ తేదీ రాత్రి సుమారు 7 క్వార్టర్లలో దొంగల హల్‌చల్ చేసి చోరీలకు పాల్పడ్డారని, గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏడు క్వార్టర్లలో ఏకకాలంలో ఈ ఘటనలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా చర్యలు చేపట్టి, అవసరమైతే మరిన్ని అమర్చాలని కోరారు. కాలనీ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఇతర అవసరాల కోసం కాలనీలను సందర్శించే వారిని సెక్యూరిటీ అనుమతి తప్పనిసరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవి.రామనర్సయ్య, వల్లూరు వెంకటరత్నం, కొడిపల్లి శ్రీలత, కల్యాణం రవికుమార్, నాజర్‌పాషా, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అమలు చేయాలి



కరకగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కరకగూడెం: నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి కరకగూడెం డిప్యూటీ తహసీల్దార్ కాంతయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసలైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మండలంలో మిగిలిపోయిన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇచ్చి త్రీఫేస్ కరెంట్ వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు, అరుహులైన వాళ్లందరికీ పెన్షన్లు ఇవ్వాలన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 2500రూపాయలు అందించి గ్యాస్ సబ్సిడీ రైతులకు రుణమాఫీ రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే రానున్న రోజుల్లో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడుతామని అన్నారు. పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు మండల కమిటీ సభ్యులు చర్ప సత్యం, కనితి రాము, పద్దం బాబురావు, శోభారాణి, లక్ష్మయ్య, పదం సత్యం, రమాదేవి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నిలువ నీడ లేదాయే...

- ప్రధాన సెంటర్లలో బస్ షెల్టర్లు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు



నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం నాలుగు సరిహద్దు రాష్ట్రాల ప్రజలకు పెద్ద దిక్కు. ప్రతి రోజు వందలాది మంది భద్రాద్రి తమ అవసరాలను తీర్చుకుని వెళ్తుంటారు. అటువంటి భద్రాచలంలో ప్రధాన సెంటర్‌లలో బస్సుల కొరకు ఎదురు చూసేందుకు నిలువ నీడ లేకుండా పోయింది. బస్సు కొంత అలస్యమైందంటే గంటల తరబడి రోడ్డుపై నిలబడాల్సిన పరిస్థితి. అది ఎండా కాలమైనా.. వర్షా కాలమైన అదే దుస్థితి. రామయ్య దర్శనానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సైతం ఈ ఇబ్బంది తప్పడం లేదు. గతంలో పట్టణంలో అక్కడక్క నిర్మించిన బస్ సెల్టర్లు నిరుపయోగంగా ఉండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

**ఎండకు ఎండి.. వానకు తడిసి..**

భద్రాచలం పట్టణానికి ప్రధానంగా చర్ల రోడ్డు, కూనవరం, చింతూరు రోడ్డులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఈ రహదారుల్లోనే అధికంగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే పట్టణానికి సరిహద్దున ఉన్న గ్రామాల ప్రజలు నిత్యవస సరుకుల కొరకు కొందరు రాగా, మరి కొందరు పలు దుకాణాల్లో పనులు చేసేందుకు పట్టణానికి వస్తుంటారు. తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌కు వెళ్లకుండా ప్రధాన సెంటర్ల వద్ద బస్సులు, ఆటోల కోసం ఎదురు చూస్తుంటారు. చర్ల వైపు వెళ్లే వారు అంబేడ్కర్ సెంటర్‌లో, చింతూరు, కూనవరం వెళ్లే వారు పాత కూరగాయ మార్కెట్‌లో వేచి ఉంటారు. ఇలా ప్రతి రోజు వందల మంది ప్రయాణికులు ఎండకు ఎండి.. వానకు తడిచి బస్సుల కొరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.

**నిరుపయోగంగా..**

భద్రాచలం పట్టణంలో గతంలో మూడు చోట్ల బస్ సెల్టర్లను దాతల సహకారంతో నిర్మించారు. అప్పట్లో అవి ప్రధాన సెంటర్లు కాగా, కాల క్రమేపి నిత్యం ప్రజల రద్దీగా ఉండే ప్రదేశాలు మారాయి. పట్టణంలోని కూనవరం రోడ్డు ప్రభుత్వ ఏరియా అస్పత్రి పక్కన, బస్టాండ్ ఎదురుగా, బిడ్జి సెంటర్ సమీపంలో ఉన్న బస్ సెల్టర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈ బస్ సెల్టర్లు ప్రయాణికులకు కాకుండా యాచకులకు ఆశ్రయం ఇస్తున్నాయి.

**ఈ ప్రాంతాల్లో అవసరం..**

భద్రాచలం పట్టణంలో ప్రధానంగా బస్ సెల్టర్లు అవసరమయ్యే ప్రధాన సెంటర్లు ఏడు ఉన్నాయి. అవి బస్టాండ్ ఎదురుగా, అబేడ్కర్ సెంటర్, బిడ్జి సెంటర్, పాత కూరగాయ మార్కెట్, కొత్త కూరగాయ మార్కెట్, రాజరాజేశ్వరి టెంపుల్ సెంటర్, రాజుపేట సెంటర్లు. నిత్యం ఈ సెంటర్ల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో బస్ సెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

### అధికారులు దృష్టి సారించాలి

పట్టణంలోని ఒక షాపులో పని చేసేందుకు ప్రతి రోజూ ప్రయాణం చేస్తున్నాను. మామూలు రోజుల్లో బాగానే ఉన్నా వర్షా కాలం బస్సుల కోసం ఎదురు చూడాలంటే వానకు తడవాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితప సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించి బస్ సెల్టర్లు నిర్మించాలని కోరుతున్నాను.

– దుర్గా ప్రసాద్, సీతారాంపురం

### ఐరన్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

భద్రాచలం పట్టణంలోని ఒక ఆస్పత్రిలో పని చేసేందుకు ప్రతి రోజు బస్సు, ఆటోలో వస్తాను. ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో బస్సుల కోసం ఎదురు చూసేందుకు సరైన ప్రదేశం లేకపోవడంతో రోడ్డుపై ఉండాల్సి వస్తుంది. ఐరన్ బస్ సెల్టర్లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులు వేచి ఉండేందుకు అనువుగా ఉంటుంది.

– మోహన్, చిన్నబండిరేవు

### బస్ షెల్టర్ నిర్మించాలి

భద్రాచలం పట్టణంలోని పాత కూరగాయ మార్కెట్‌లో బస్ షెల్టర్ నిర్మించాల్సిన అవసముంది. సరిహద్దు రాష్ట్రాల ప్రజలకు తమకు కాలాల్సిన నిత్యవర వస్తువులు కొనుగోలు చేసుకుని ఇక్కడ నుంచే బస్సులు, ఆటోలు ఎక్కుతుంటారు. ఇక్కడ బస్ సెల్టర్ నిర్మించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రమణ, నెల్లిపాక, ఏపీ